# కన్నీళ్ళు తిరగబడతాయ్

ఆ నరకానికి చాలా పేర్లు!

ఆసుపత్రి, తహసీలు కచేరి, కలెక్టరాఫీసు, పోలీస్‌స్టేషన్, కోర్టు - మచ్చుకి!! ఆనరకాన్ని పిలిచేపేర్లు ఇంకా ఎన్నో ఉన్నాయ్. సంఖ్యలో చెప్పడం కష్టం. అందులోని రాక్షసులకు రకరకాల పేర్లు, అక్కడికి వెళ్ళే మనుషుల రక్తం మిగల్చకుండా తాగేస్తారు.

శవాలు, బయటకు వస్తాయ్ —

ఇప్పుడు, ఇక్కడి నరకం పేరు ఆసుపత్రి. డాక్టరు - రాక్షసుడైనా కొంత నయంగా వుండేది. ఆమెనర్స్ - అతని భార్యైనా బావుండేది. కాని నగ్నదృశ్యం, అది నగ్నసత్యం.

వాళ్ళకు సెన్సార్ లేదు —

అతడు అలిసిపోయేట్లు చేస్తేనే - ఆమె ఉద్యోగం - బయట వరండాలో చల్లగాలి కేలండర్లతో, విండోకర్టెన్స్‌తో రాసక్రీడ లాడుతోంది. ఆ వరండాలోనే

రోజూకు రెండుపూటలు ఎంతోజనం నిండుతారు. ఆనారోగ్యం నిండుతుంది-ఆరోగులు మందుకొరకు వస్తారు. ఊపిర్లు 'రినివెల్' చేయించుకునేందు కొస్తారు.

వరండాలో మూలవున్న బల్లమీద చామనచాయరంగు గల దీర్ఘకాయుడు జగ్గారావు, నిద్రలో ఏకో జ్వరుకుంటున్నాననే గర్వంకొద్దీ 'గుర్రు' మంటు న్నాడు లయబద్ధంగా - పొట్టను ఉబ్బొంగిస్తూ - జగ్గారావు ఆ స్థితిలో వున్నా డంటే - ఆ సమయం పగలు తప్పకుండా కావాలి, ఉదయం క్లినిక్ మూయ గానే పడుకుంటే, మళ్ళీ సాయంత్రం తెరిచే సమయందాకా అదే మూర్ఛలాంటి తాత్కాలిక చావు!

జగ్గారావు ఒక్కడేకాదు, కంపౌండర్లు చారి, జనార్ధన్‌లు ఎప్పుడూ డాక్ట రుతో లోనవుండే అభిమానవతి ('బోనమ్మనుండి పూర్తిగా మారిన నర్స్) భానుమతి ఇంకో ముసలి ఆయా పోషమ్మ ముఖ్యమైనస్టాఫ్ ఆక్లినిక్‌లో - వీళ్ళే బాధ్యత మీదేసుకుని, రకరకాల రోగులకు ఒకేరంగు నీళ్ళు సమానంగా పంచి పోస్తారు

అది ఆసుపత్రి ప్లస్ రెసిడెన్సీ - డాక్టరుకు.

వరండానుండి పిలుపు, బొంగురుగా ఏదోవ్యధ వక్తం చేస్తునట్లు-"డాక్టరు గారు ...డాక్టరుసాబ్" తిరుపతిగుళ్ళో దేవుడికొరకు భక్తుడి అరుపులాగా-గుళ్ళో దేవుడు చప్పుడు చేయడు-ఈ దేవుడు చేశాడు.

'మళ్ళీ ఎవరు, ఆయా<.... ( విసుగు.

తలుపులు తెరుచుకున్నాయ్-గుడిద్వారాల్లాగా, బెల్లాన్ని విడువలేని ఈగ లాగ ఇష్టాన్ని బాధపెడుతూ వచ్చాడు బయటికి డాక్టరు.

ఎదురుగా అతను!

శవాన్ని భుజంమీద వేసుకుని సరాసరి తనదగ్గరికొచ్చిన విక్రమార్కుడి లాగా-

అతని కళ్ళలో ఎరుపు-

అతని బాధనంతా కడిగేద్దామని యత్నించి విఫలమై సిగ్గుతో తలవంచు కుని కను కొలుకుల్లవెంట జారిపోతున్న కన్నీళ్ళు!

"ఏమిటోయ్ మళ్ళీవచ్చావ్? డిస్పెన్సరీ టైం అయిపోయింది. వెళ్ళిపో అంటే ఆమెను ఎత్తుకునే వచ్చావ్. చెప్పింది నీకుకాదనుకున్నావా?" - డాక్టరు కోపం కేకలేస్తుంది.

కాదండి మీరు కొంచెం పరిక్ష చెయ్యాలిసార్. పూర్తిగా బలహీనమైపో యింది. ఆలస్యమైతే ప్రాణం పోతుందేమో - కూర్చునే ఓపికకూడా లేకుంటే అదిగో బండిమీదేసుకొచ్చాను. మాఊరు చాలాదూరం నేనిక్కడ కలెక్టరాఫీసులో పనిచేస్తున్నాను. ఇక్కడ మాకెవ్వరూ లేరుసార్. దీని తల్లిగారిల్లుకూడా చాలా దూరం. హైద్రాబాదు తీస్కెళ్దామంటే త్రోవలోనే ప్రాణం పోయేస్థితిలో వుంది. పరీక్షచేసి, అవసరమైతే మీకార్లో సిటీకి తీస్కెళ్ళండిసార్. మీకు పెద్దపెద్ద డాక్టర్లు తెలిసుంటారు. ఎలాగైనా ప్రాణాలు నిలపండి. మీరెంత ఫీజంటే అంత"....

'సరెసరె నువ్వుచెప్పేది బాగానేవుంది. ఇప్పుడందుకు సమయం కాదు గదా! సాయంత్రం నాలుగింటికి తీసుకురా,"

అతడు మరోనరకం బ్రాంచ్‌లో పని చేస్తున్నాడనైనా కొంచెం యిదిలేదు. తనంత కాకపోయినా ఏదో చిన్నపాటి రాక్షసుడై వుండాడు. అందుకోసమైనా అడగ్గానే పరీక్షచేయడెందుకు? రాక్షసులకు - దేవతలకు పడదని విన్నాంగానీ, రాక్షసులకు, రాక్షసులకీకూడా పడదుకాబోలు! మనిషికి మనిషికి పడనట్లు- అతని కేమీ పాల్పోవడంలేదు. కేలండర్లు పటపట శబ్దం చేస్తున్నాయ్

భుజంమీదున్న అతనిభార్య అనబడే శరీరం బాగా బాధపడుతోంది. నోటినుండి చొల్లుకారుస్తోంది. క్రింద గోడప్రక్కగా ఆమెను పడుకోబెట్టాడు.

డాక్టరు ఇప్పుడామెముఖం చూడగల్గుతున్నాడు - మెరుపులాంటి తెల్లని చర్మం. 'చక్కగావుంది. అనారోగ్యంవల్ల అసహ్యంగా తయారైందిగాని, లేకుంటే ఎంత అందం? ఇంతటి అందాన్ని ఈ మొద్దువాడికి ధారబోసిందా ఇది నాలాంటి వాడికైతే....' - డాక్టరు మృగం కోరిక.

కథా నిలయం
809
శ్రీకాకుళం



ఆ సమయంలో అతనికి డాక్టరు దేవుడిలా అనిపిస్తున్నాడు.

డాక్టరుకతడు దయ్యంగా అనిపిస్తున్నాడు.

"సర్ చూడకండిసార్, అది చచ్చిపోతే నేను బతకలేను. ఇద్దరు పసి పిల్లలు. వారికి తల్లిలేకుండా పోతుంది".

"అయితే ఏమంటావ్? టైంలో తీసుకురా. అప్పటివరకేం చావదులే- కొంచెంసేపు రెస్టుతీసుకో నివ్వరు. జగ్గారావ్ జగ్గారా...."

'ఆఁ-సార్!'-ఒక్కసారి అదిరిపడి లేచాడు.

"ఇతణ్ణి బయటికి పంపించు" - డాక్టరు అంటూ లోనికెళ్ళిపొయ్యాడు. దైవ దర్శనమైపోయినట్లు-తలుపులు.

గ్రుడ్డుపగిలి లోని పిల్లమెల్లగా నడిచినట్లు, పగిలిన నిద్రలోంచి కళ్ళు తెరచి మెల్లగా తూగుతూ వచ్చాడతను,

'నడుప్ చలో....'

చెప్పేకుదగ్గరగా ఈమాటలంటున్నా-ఎక్కడో దూరంగా వినిపిస్తునట్టు- స్పష్టంగా వినిపించడంలేదు.

భార్యముఖంలోకి చూస్తున్నాడు-కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. 'పోపో పొద్మికిరా' - కష్టమూతలు పడుతున్నాయి జగ్గారావుకు.

"ఎప్పుడైతేనేటండి? గవర్నమెంటుదేంకాదుగదా! మీదేనాయె,ఎప్పుడైనా చూడొచ్చు. ప్రాణంపొయ్యేట్లుంది. మీ డాక్టరుకుచెప్పండి ఫీజెంతైనా యిస్తాను. దయచూడాలిసార్....నాఖర్మ....అయ్యో! ..."నెత్తికొట్టుకున్నాడు. మాట్లాడుతూ ఏడ్చాడోలేక ఏడుపులోనే ఉద్వేగం ఉండబట్టలేక,మాటలు దొర్లాయో తెలియడం లేదు - చెమటలుకారుతున్నాయ్ అతనికి - ఆమెలో విపరీతమైనబాధ, కడుపులో ఒక్కొక్క పేగూ కత్తిరిస్తున్నట్లు - నోటినుంచి చొల్లు కారుస్తుంది, బాధలా - తుడవడం చేతకాని డాక్టర్లాంటి ఈగలు, దోమలు గుయ్‌మంటూచేరి పరమ అసహ్యంగా ప్రాణం తీస్తున్నాయ్. ఈ కడుపునొప్పికన్నా ప్రాణం పోయినా బావుండు నన్నట్లుంది, ఆమెకు.

అతనికి - డబ్బెంత పోయినాసరే ఆమెప్రాణం నిలుస్తె చాలన్నట్లుంది. తనుచచిపోతే తనపిల్లల బ్రతుకు, భర్తబ్రతుకు ఎలా? నన్న ఆలోచనలు అప్పుడప్పుడామెలో - భయంకరమైన మూలుగు, కదలిక....ఆమె చనిపోతే తన జీవితమెంత నికృష్టంగా తయారవుతుందో? చీకటి, నిరాశ,....నిశ్శబ్దం, మురికి, జ్ఞాపకానికొచ్చి ఊపిరిలో కఠోరభయంకలిగింది. కన్నుగుడ్లకు రంధ్రాలు పడిపోయినట్లు - ఒకటేధార.

నిద్రచెడిపోయిందని జగ్గారావుకు విసుగ్గావుంది. అపులిస్తూ, చిటికెలేస్తూ 'పోవయాంటుంటేనేమో....'

అదాటునలేచి తలుపు బాదాడతను 'డాక్టరుగారూ .... డాక్టర్‌సార్'- ఓ మూడునిముషాల తరువాత కోపం తలుపు తెరిచింది - మానవత్వమున్న డాక్టరుకాదు.

చేతులు జోడించాడు. ఇంతకుముందు ఏఆఫీసరుముందైనా అలా చేతులు జోడించే ఖర్మపట్టలేదు. 'అన్యాయం చెయ్యకండిసార్....చూడండి. ఏం కడుపు నొప్పోఏమో భయంగావుంది"

డాక్టరు విసుగ్గావచ్చి నాసలుపట్టుకున్నాడు. నాసలు చూశాడు చెంప లోనగదిలో భానుమతి చెక్కిళ్ళు ఎంత బావున్నాయో, ఇప్పుడే రావాలా ఈ ఈడియట్'—ఆలోచనలు

'డాక్టర్‌సాబ్'—అన్నాడతను.

"వూఁ"-తేరుకున్నాడు 'కడుపునొప్పా' - విసుగుతో

"అవునుసార్"

మూసివున్న ఆమె కనురెప్పలు తెరచిచూసి - "ఎంతకాలం నుంది?"

'ఆర్నెల్లక్రితం ఇలాగే అయింది. హైదరాబాదులో పదినుహేరోజులు హాస్పిటల్లోవుంచాము. ఇంజక్షన్ను, మందులు ఇచ్చారు. మళ్ళీగనుకవస్తే ఆపరేషన్ చెయ్యాల్సొంటుందన్నారుసార్, ఇవే ఇదివరకు వాడినమందులు...." జేబులోని ప్రిస్క్రిప్షన్ కాగితాలు అందించి భారమంతా మీదేనన్నట్లు చూశాడు.

ఎన్ని చూయిస్తేనేం, ఏం చెబితేమాత్రం ఏం?-డాక్టరు విధినిర్వహిస్తునట్టు "నయం చేయడానికి మూడువందలవుతుంది. యివ్వగలవా" అన్నాడు.

"మీరు కొంచెందయుంచాలి. మీరెన్నంటె అన్నే-నాసర్వస్వం అమ్మిచ్చినా ఫరవాలేదు. కాని బ్రతికేలా ఏదైనా చేయండిసార్"

"డబ్బుతే-చేస్తా"

"ఇచ్చుకుంటానుసార్ - తప్పకుండా. మొదలు దానిసంగతి చూడండి. ఉన్నపళాన ఎలాతేగలను. ఎవర్నడిగినా ఎవరిస్తారు? 2, 3 రోజుల్లో యిచ్చుకో గలను-ఇప్పుడోయాభై యిస్తానుసార్"-తీయబోయాడు జేబులోంచి.

డాక్టరుకు బాగా తిడదామనిపించింది.

అతనికి డాక్టరు కాళ్ళు పట్టుకోవాలనిపించింది.

"అదేంలేదుపో యిష్టంలేకపోతే - సరిగ్గా సమయానికి దాపురించావేం"- విసుగుకక్కాడు.

"తెస్తాను, మీరు మొదలెట్టండి" ఏడుపుస్వరం వణికింది.

"చెబితే వినిపించదూ? తెస్తేనే మొదలెట్టేది. బ్లడీబగ్గర్స్' - అంటూ గొణుగుతూ కాగితాలు విసరికొట్టి మళ్లీలోని కెళ్ళాడు - ఎదుటివాడు తన నలా తిట్టలేదన్న ధీమాతో—

జగ్గారావు విసుగుతో ఫో ఫో అని చెప్పి పడుకోబోయే యత్నం చేస్తున్నా డదే బల్లమీద, నిశ్శబ్దం ఆవిడ నీరసపు మూలుగులో అతి వికృతంగా తయారవు తోంది. నిస్సహాయత అతని ఆలోచనల్ని నరికేస్తుంది.

అనారోగ్యాన్నెదురుకునే చేవఆమెలో లేదు.

ఆమె అనారోగ్యాన్ని పారద్రోలేడబ్బు అతనిదగ్గరలేదు - బలహీనత ఇద్దరినీ చంపేస్తుంది. ఈగలు దోమలువాలకుండా ఆమె కొంగును నోటిమీదుగా కప్పిలేచాడతను. ఎలాగైనా మూడువందలుతేవాలని....వరండా దాటిబయటకు నడిచాడు.

ఇప్పుడతని అడుగులు ఆశవైపు-ఎదుర్కొనబోయె పరిస్థితుల్లాగామండు తున్న సూర్యుడు. ఎర్రగా వెలుపలి జ్యోతిఅఖండంగా వెలుగుతోంది. లోనఒకటి

ఆరిపోనుంది తన అభిమానాన్ని హత్యచేసుకుని, చాపినచేతులో వెళ్ళాడు పూళ్ళోకి చిట్లించిన కళ్ళు, పెద మొహాలు, 'దూ'లు లభించాయి.

తెలిసివున్న తలుపు గుండెలన్నీ తట్టాడు. కొన్నికన్నీళ్ళు విడిచాయి. కొన్ని అసహాయపు చేతులుచాపాయి. కొన్ని నిట్టూర్పులు మాత్రం అందించాయి కొన్ని చెవులుమూసుకున్నాయ్.

ఉన్నఫళాన మూడువందలు కావాలి! తిరిగాడు రోడ్లు పరిగెత్తినట్లా గాలిపీచి నట్లా—

గాఢాంధకారంలో మెరుపు మెరిసినట్టు ఆ భయంకర ఆందోళనలో ఓ ఓదార్పు లభించింది. సేఠ్ కిష్టయ్యనుండి, ఇప్పుడిప్పుడే మానవుడినుండి రాక్షసుడిగా మారుతున్నాడు. పాతలాల్చీలల్లో పెరిగేబొజ్జ దిగబడడం లేదని ఇప్పుడిప్పుడే కొత్తగా, పెద్దగా, కుట్టించుకుంటున్నవాడు—

ఇంట్లోని బంగారుగొలుసు, రేడియో, రిస్టువాచ్, వగైరాలన్నీ కుదువ బెడతానంటే, యింటి తాళంచెవి వద్దంటూనే తీసుకుని మూడొందలిచ్చాడు. అయినా ఫరవాలేదు. అతని మనస్సు కృతజ్ఞతాపూర్వకంగా మెదిలింది కళ్ళలో ఆశాజ్యోతులు వెలిగాయి. అప్పుడు జ్ఞాపకమొచ్చింది. తనుడబ్బుకొరకునాలుగు గంటలనుండి తిరుగుతున్నాడని....నోట్లు పైంట్‌జేబులో చుట్టబెట్టి, నిరాశల్ని పడుకోబెడుతూ, భార్యను రక్షించుకోగలనన్న ధీమా నడిపిస్తూవుంటె, నడిచాడు హాస్పిటల్ వైపు.

"ఈడబ్బు తీసుకుంటాడు డాక్టరు. నయంచేస్తాడు. భార్య బ్రతుకుతుంది. మళ్ళీఎప్పటిలా హాయిగా జీవితం - క్రమంగా మెల్లెక్కుతున్న ఆలోచనలూ కాళ్ళూ....

వరండాచేరి ఆగిపోయ్యాయ్!!

ఆమె ముఖంనిండా బట్టకప్పివుంది మూలుగు లేదు??

ఆమె మూలుగును దిగమ్రింగిన నిశ్శబ్దం గుండెలు బ్రద్దలు చేస్తున్నట్లుగా - అతను "డాక్టర్"!?

జగ్గారావులిక్కిపడి లేచాడు వేసివున్న తలుపులు ధబాలున తీసి తొంగి చూసి పోయింది భానుమతి.

'ఏమిటిసార్ ఏమైంది ? - పూర్తిగా ఎందుకప్పారు ? — మెల్లిగా అడుగు లేస్తూ, ఆతురతతో అడిగాడతడు.

ఏంది ? నువ్వింకపోలే। పొమ్మంట్నిగదా - జగ్గారావు అంటున్నాడు. డాక్టరొచ్చాడు.

'సార్ ఇదిగో డబ్బు తెచ్చాన్ సార్ - ఇలా ఎందుకు కప్పారు ? సార్ పుట్టిగానేనా - ఏమైనా అయిందా ?'

"మేమెందుకు కప్పాము ? నేను రానే లేదు - గాలిగ్గానీ పడిందేమో - తీసెయ్య."

వణుకుతున్న చేతుల్తో తీసాడు. ఆమె ముఖం తెల్లగా, నిర్మలంగా, ఏమీ-కాలేదనట్లు - కాని డాక్టరు నాడి చూసి అయిపోయిందన్నాడు.

"ఆఁ"....అన్నాడతను అంతే! అతనిలోని అతను చచ్చిపోయ్యాడు. అతని చూపులో భయం, శూన్యం.

'మేం చెయ్యాల్సిన పని గాలే చేసింది తీసుకెళ్ళు' - జాలిలేని, కరకర లాడే ఎండిన మాటలవి.

'అయిపోయిందా ఇంతడబ్బు తెచ్చాను సార్ .... చివరిసారి ఏం చెప్తూ చచ్చిపోయిందో' గాద్గికంగా వున్నాయా మాటలు కన్నీళ్ళే మాటల్లా మారినట్లు.

డాక్టరు, జగ్గారావు నిశ్శబ్దపు బొమ్మల్లా నిలుచున్నారు. 'ఎంబడెంబడె రొండిజషన్లిసై బత్కేదేమో' - అనుకున్నాడు జగ్గారావు, కాని ఏమీ అనలేదు.

అతనిలోని ఏడుపు - క్రోధంగా మారుతుంది. విచారం మళ్ళు తిరిగి ఉక్రోశంగా రూపుదిద్దుకుంటోంది. క్రమంగా అగ్నిగోళాల్లా మారిన కళ్ళలోని నీళ్ళింకి పొయ్యాయి. గొంతు జీరపోయి కఠోరంగా తయారయింది

మొదలే చూడనుంటే చూడకపోతివి గదరా. నీదబ్బాశ పాడుగానూ .... న భార్యను నువ్వే చంపావ్. బొందమీద పెట్టుకుంటావుర్రా రూపాయలు

తీస్కో గాడిదకొడుకా!, నోట్లో తీసి - డాక్టరు తలకేసి విసిరాడు. అతని మాటల్లో మర్యాద లక్షణాలు మరణించాయి.

'ఏయ్ రాస్కెల్ మతిగానిపోయిందా? బ్రూట్ - నన్నే కొడతావుట్రా - జగ్గారావు మెడలు పెట్టి గెంటేయ్ వీణ్ణి - మతి చలించినట్టుంది. ఈ పీనుగును బయటవెయ్ టైమవుతోంది క్లినిక్ తెరువ్.

"అరే నాకేం మతిపోలేదురా నాలాంటివాడి కెప్పుడూ పోదుబే - నిన్ను కొడతానా? చంపుతానా? చూస్కో - ఇంకెందరిని చంపుదామని క్లినిక్ తెరవమంటున్నావు" - బలమైన జగ్గారావు చేతులతన్ని బయటకు నెట్టుతూ వుంటే డాక్టరు లోనికెళ్ళాడు. అతనిలో డాక్టరు గొంతు పిసకాలన్న ఉద్రేకం ఉంది.

అవును కథ? పేసి ఈ క్లినిక్‌నే చచ్చిం తరువాత సానుభూతి చూపే లోకమనుకుంటే ——

డబ్బుంది, డబ్బుతాగే ఘరానా పెద్ద మనుషులకు, ఎదుటివాళ్ళూ' తామూ మనుషులమే నన్నది మరచినవాళ్ళకు కామాంధులకు ప్రతినిధి డాక్టరు'

ఇప్పుడే కాకపోయినా, బలంగా దెబ్బ తినేరోజు దగ్గరికొస్తుందని, కన్నీళ్ళలోనే మంటలుద్భవిస్తాయని గుర్తించరు.

డాక్టరెన్ని అన్యాయాలు చేస్తున్నాడో లెక్క తెలిసుండికూడా, జగ్గరావూ, భానుమతి లాంటి వాళ్ళు, ఆత్మవిమర్శ చేసుకోకుండా నీచపు యజమాని బిస్కట్లకు అలవాటుపడ్డ కుక్కలు - గుర్రుపెట్టి నిద్రపోక, మానం అమ్ముకోక ఏం చేస్తారు?

ఆమె - బీద జనానికుదాహరణ! ఒక్క కడుపు నొప్పేమిటి? క్షణ క్షణం మంటల్తో అలాగే చస్తారు! ఏం చేస్తారు?

మధ్య తరగతి వాడిలా - అతను.

ఇటువంటి పెద్దలనబడే వాళ్ళు దరికి రానివ్వరు కాబట్టి బీదవాళ్ళతోనే సహజీవనం చెయ్యాల్సొస్తుంది మరి. కాని లాభమేం? వాళ్ళ అనుగ్రహం దొరకదు - ఇటు వీళ్ళ సహకారం లేదు.

ఇక్కడ చితిమీద మంట మండించి. అప్పటిదాకా, మండిన సూర్యుడు దూరంగా ఆరిపోతున్నాడు.

చితిమీద, మంటలోంచి ఆమె నవ్వుతోంది - వెలుగులా నిశ్శబ్దంగా కూర్చున్న అతని మస్తిష్కంలో భయానకపు ఆలోచనలు దొర్లుతున్నాయ్ - అలుగులా.

ఓపిక కన్నీళ్ళు కార్చి కార్చి ఊరుకుంది. కన్నీళ్ళు తిరగబడ్డాయ్. జారిపోక పైకెగబ్రాకి మళ్ళీ కళ్ళగోళాల్లోకి చేరుకుని, గుండెమంటలను వేడెక్కుతున్నాయ్.

సూర్యుడు కళ్ళలో నిలిచినట్లు, ఉన్నాయి ఇప్పుడతని కళ్ళు.

అతని జ్వలిస్తున్న గుండె కొలిమిలో ఎర్రగా కాలుతున్న కోర్కెల యినుపకర్రులు - డాక్టరు అన్యాయపు గుండె నేలను దున్నడానికి.

అతనిలో తయారవుతున్న ప్రతీకారం పారలు - డాక్టరు ఊపిరి, ఊపిరితిత్తుల్లోకి పారకుండా మళ్ళించి అడ్డుకట్ట వేయడానికి - సిద్ధమవుతున్నాయి!

చీకటి పడింది.

అతడూ లేచాడు - నిజాయితీలా

చిమ్మచీకట్లో మంటలా –

అహంకారం గుండెల్లో దూసుకుపోగల తుపాకి గుండులా.

1974